క్లుప్తంగా

నేడు మహాలయ అమావాస్య

జడ్చర్ల టౌన్: మహాలయ అమావాస్య పురస్కరించుకుని శనివారం గిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఆచార్య కృష్ణస్వామి తెలిపారు. మహాలయ అమావాస్య సందర్భంగా పితృదేవతలకు తర్పణాలు, పిండాలు వదలటం చేస్తారు. ఈ కారణంగా పితరుల అమావాస్యగా పిలుచుకుంటారు. పెద్దలకు పూజలు చేసేందుకు చనిపోయిన తమ కుటుంబ పెద్దల ఫొటోలు ఫ్రేమ్‌లు కట్టించుకునేందుకు శుక్రవారం పట్టణంలోని ఫొటోస్టూడియోలు రద్దీగా మారాయి.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



జడ్చర్ల టౌన్: వరంగల్‌లో శనివారం నుంచి నిర్వహించనున్న జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి రమ్యశ్రీ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ అప్పియాచిన్నమ్మ శుక్రవారం తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాలలో అభినందించారు. పోటీల్లో రాణించి కళాశాలకు పేరు తీసుకురావాలని సూచించారు.

పీహెచ్‌డీ అందుకున్న ప్రభాకర్



చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తికి చెందిన జేడీ ప్రభాకర్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. శుక్రవారం గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో సెంట్రల్ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ జగదీష్‌కుమార్, యూనివర్సిటీ చాన్స్‌లర్ నరసింహారెడ్డి, వీసీ బీజే రావు చేతుల మీదుగా పట్టాను అందుకున్నారు.

తక్కువ ధరకు పశువులు అమ్ముతామని చెప్పి..

నవాబుపేట: తక్కువ ధరకు పశువులను అమ్ముతామని నమ్మించి మోసం చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని దర్పల్లికి చెందిన ఆరె రమేష్‌కు ఫోన్ చేసి తన వద్ద ఆవులు ఉన్నాయని దాదాపుగా రూ.లక్షకు పైగా విలువ చేసే రెండు కేవలం రూ.60వేలకు అమ్ముతానని నమ్మించాడు. పైగా వాట్సప్ ద్వారా ఆవుల ఫొటోలు పంపించటంతో నమ్మిన రైతు పలు దఫాలుగా ఫోన్‌పే ద్వారా రూ.60 వేలు అతని ఖాతాలో వేశాడు. అతడు డబ్బులు ముట్టిన వెంటనే ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో కంగుతున్న ఆరె రమేష్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. పరిచయం లేని వ్యక్తుల మాటలు నమ్మవద్దని ఎస్‌ఐ సూచించారు.

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ కబడ్డీ పోటీలకు జగన్‌మోహన్‌గౌడ్



పీఈటీ జగన్ మోహన్‌గౌడ్

మహబూబ్‌నగర్ క్రీడలు: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ కబడ్డీ పోటీలకు జిల్లాకు చెందిన వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు బి.జగన్‌మోహన్‌గౌడ్ (పీఈటీ ఆలూర్ జెడ్పీహెచ్‌ఎస్) ఎంపికయ్యారు. ఈ నెల 16 నుంచి 20 వరకు ఢిల్లీలోని త్యాగరాజ స్టేడియంలో జరగనున్న జాతీయ సివిల్ సర్వీసెస్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర కబడ్డీ జట్టుకు జగన్‌మోహన్‌గౌడ్ ఎంపికయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో డెహ్రాడూన్‌లో జరిగిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ కబడ్డీ పోటీల్లో పాల్గొని తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. జగన్‌మోహన్‌గౌడ్‌ను పెటాటీఎస్ జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, పీడీ వేణుగోపాల్, పెటాటీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నిరంజన్‌రావు, ప్రధాన కార్యదర్శి రాజవర్ధన్‌రెడ్డి, వడెన్న, జి.శ్రీనివాస్‌గౌడ్, పరశురాం, రామేశ్వరయ్య తదితరులు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

నారాయణపేట ఎస్పీగా యోగేష్‌గౌతమ్



నారాయణపేట: జిల్లా నూతన ఎస్పీగా 2018 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన యోగేష్ గౌతమ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇదివరకు ఉన్న ఎస్పీ వెంకటేశ్వర్లు ను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బదిలీ చేసిన విషయం విదితమే.

పూర్తయిన ఉడిత్యాల-సూరారం బ్రిడ్జి



సూరారం-ఉడిత్యాల మధ్యలో దుందుభీనదిపై పూర్తయిన బ్రిడ్జి

- తీరనున్న పరిసర గ్రామాల ప్రజల రవాణా సమస్యలు
- మండల కేంద్రానికి తగ్గనున్న దూరభారం

బాలానగర్: సూరారం-ఉడిత్యాల మధ్య దుందుభీ నదిపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు పూర్తి కావడంతో పాటు బీటీ రోడ్డు చివరి దశకు చేరింది. ఇరు గ్రామాల ప్రజల చిరకాల కోరిక ఎట్టకేలకు తీరింది. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న బ్రిడ్జి పనులు ప్రారంభించిన సంవత్సర కాలంలో పూర్తి కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్లుగా ఇబ్బందులు

గతంలో దుందుభీనదిపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వర్షాకాలంలో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు దాటలేక వారం రోజుల పాటు సెలవులు ప్రకటించిన సందర్భాలు ఉన్నాయి. అత్యవసర సమయంలో గర్భిణుల కోసం అంబులెన్స్ రావాలంటే వర్షాకాలంలో సూరారం గ్రామానికి చేరుకోక ముందే ప్రసవమైన సందర్భాలు ఉన్నాయి. వర్షాకాలంలో సుమారు 17 కిలోమీటర్లు తిరిగి మోతీఘణాపూర్ మీదుగా రావాల్సి వస్తున్న పరిస్థితి. పక్కనే ఉన్న ఉడిత్యాలకు వెళ్లాలన్నా పదుల కిలో మీటర్లు తిరిగి వెళ్లాల్సిందే. దీంతో సమయం, వ్యయం వృథా అయ్యేది. బ్రిడ్జి నిర్మాణం కోసం గ్రామస్తులు పలుమార్లు ధర్నాలు చేసి కలెక్టర్‌కు, ఎంపీ, ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చారు.

రూ.4.2కోట్ల నిధులతో..

ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.3 కోట్లు, బీటీ రోడ్డుకు రూ.1.2 కోట్లు మంజూరు చేయించారు. పనులు చకచకా చేపట్టి ఏడాది లోపే బ్రిడ్జి అందుబాటులోకి వచ్చింది. ఇలాంటి సమస్యలకు బ్రిడ్జి నిర్మాణంతో శాశ్వత పరిష్కారం లభించింది. బీటీ పూర్తి అయితే 10 కిలోమీటర్ల దూరంలోని మండల కేంద్రానికి డబుల్ రోడ్డుగా ఉన్న ఉడిత్యాల బీటీ రోడ్డుతో 15-20 నిమిషాల్లో చేరుకోవచ్చు.

మరువలేనిది..



బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చొరవ మరువలేనిది. ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా బ్రిడ్జి నిర్మాణం కోసం కృషి చేయలేదు.

– మల్లేష్ యాదవ్, సర్పంచ్, ఉడిత్యాల

శుభపరిణామం



తమ గ్రామ ప్రజల సమస్యలపై ఎట్టకేలకు బ్రిడ్జి నిర్మాణంతోపాటు బీటీ రోడ్డుకోసం నిధులు మంజూరయ్యాయి. రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించింది. ఉడిత్యాల నుంచి బూర్గుల గేట్ వరకు బీటీ వేయడం శుభపరిణామం.

– నర్సింహులు, సర్పంచ్, సూరారం

కేసీఆర్ సభను విజయవంతం చేద్దాం



బాలానగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

బాలానగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్‌గా అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దాయపల్లి ముఖ్య కూడలి వద్ద బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 18వ తేదీన జడ్చర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసే సభకు సీఎం కేసీఆర్ రానున్నారని తెలిపారు. సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నుంచి ప్రతి ఇంటికి చేరిన సంక్షేమ కార్యక్రమాలపై, గ్రామాల్లో అభివృద్ధిపై చర్చించాలన్నారు. అధికారంలోకి వచ్చాక పార్టీ కోసం పనిచేసిన వారిని సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. సభకు ప్రతి వార్డు నుంచి 50 మందికి తగ్గకుండా, గ్రామం నుంచి కనీసం 300 మందికిపైగా రావాలన్నారు. కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ వాల్యానాయక్, వైస్ ఎంపీపీ వెంకటచారి, గోపాల్‌రెడ్డి, లక్ష్మణ్ నాయక్, సాయికృష్ణ, చెన్నారెడ్డి, జగన్ నాయక్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో చేపపిల్లల విడుదల



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని మినిట్యాం కుబండ్ నల్లచెరువులో శుక్రవారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘంకు కేటాయించిన చేపపిల్లలను మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి వదిలారు. అంతకుముందు ఆమె చెరువు వద్ద పూజలు చేశారు. అదేవిధంగా సంఘం పరిధిలో ఉన్న మరికొన్ని చెరువుల్లోనూ చేపపిల్లలను వదిలారు. కార్యక్రమంలో రవీందర్, చంద్రమౌళి, మురళీధర్, సత్యం, శ్రీశైలం పాల్గొన్నారు.

గ్యారెంటీ పథకాలను ప్రతి గడపకూ తీసుకెళ్తాం



గ్యారెంటీ పథకాల పోస్టర్లను విడుదల చేస్తున్న అనిరుధ్‌రెడ్డి, నాయకులు

జడ్చర్ల: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న గ్యారెంటీ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్తామని టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పథకాలను ప్రతి కార్యకర్త ఇంటింటికీ తీసుకెళ్లాలని, కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలను అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అమలు చేస్తామన్న విషయాన్ని వివరించాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అరాచకాలు, అహంకారపూరితమైన ధోరణులు ఇప్పటికే శృతిమించాయని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకుల కబ్జాలు, అవినీతి అక్రమాలు పరాకాష్టకు చేరుకున్నాయన్నారు. ఈ పాలనకు త్వరలోనే ప్రజలు ముగింపు పలకబోతున్నారని అన్నారు. ఎమ్మెల్యే ఇక పదవి విరమణ కోరుకోవాలని, తమ లాంటి యువనాయకులను స్వాగతించాలని కోరారు. ఈనెల 15 నుంచి మున్సిపాలిటీలో గడప గడపకు తాము వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తామన్నారు. మున్సిపాలిటీలో అనేక సమస్యలు ఉన్నాయని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రబ్బానీ, మాజీ ఎంపీపీ నిత్యానందం, అశోక్‌యాదవ్, సర్వరాజ్, యాదయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం

మహమ్మదాబాద్: కాంగ్రెస్ పార్టీతోనే బీసీలకు తగిన న్యాయం లభిస్తుందని బీసీ సెల్ మండల అధ్యక్షుడు ముకుందం తెలిపారు. కమిటీల్లో భాగంగా శుక్రవారం మండలంలోని మంగంపేట్, జూలపల్లి, మొకర్లాబాద్ తదితర గ్రామాల్లో బీసీ కమిటీలను ఎన్నుకున్నారు.

పట్టణ కాంగ్రెస్ ఓబీసీ కార్యవర్గం నియామకం

స్టేషన్ మహబూబ్‌నగర్: పట్టణ ఓబీసీ కాంగ్రెస్ బండి మల్లేష్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని నియామకం చేశారు. పట్టణ ఓబీసీ ప్రధాన కార్యదర్శిగా ఎం.వి జయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసాచారి, దేవేందర్, అంజి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నరేష్, బుచ్చయ్య, పవన్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా చెన్నయ్య, ప్రవీణ్‌కుమార్‌లను నియామకం చేశారు.

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండలాల్లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. అడ్డాకుల మండలంలో కందూర్, గుడిబండ, వర్నె గ్రామాల్లో నాగిరెడ్డి, మండలాధ్యక్షుడు శ్రీహరి, ఎంపీటీసీ శకుంతల ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. మూసాపేట మండల కేంద్రంలో శెట్టిశేఖర్ ఆధ్వర్యంలో గడ్డం మహేందర్, జలగరి శ్రీను, నారాయణ, సత్తార్‌లు ఆరు గ్యారెంటీలపై ప్రచారం చేపట్టారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి పార్టీలోకి చేరుతున్నట్లు నాయకులు తెలిపారు. ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, కోట రాము, పలువురు ఉన్నారు.

మద్యం పట్టివేత



చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తిలో శుక్రవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన బాలస్వామి కిరాణం షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా 32 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బాలస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

ప్రగతిబాటలో పల్లెలు



ఓబ్లాయిపల్లి శివారులో డబుల్ బెడ్రూం ఇళ్లు

- పుష్కలంగా నిధులు.. సమస్యలు పరిష్కారం

మహబూబ్‌నగర్ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాలు నందనవనాల్లా మారాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. పల్లె ప్రకృతి వనాలు, హరితహారం మొక్కలతో పల్లెలు సుందరంగా మారాయి. మొక్కలు ఎండిపోకుండా ట్యాంకర్ల ద్వారా నీరు పోసి సంరక్షిస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పంచాయతీ ట్రాక్టర్ ద్వారా సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డులకు తరలిస్తున్నారు. ప్రభుత్వం నుంచి నేరుగా పంచాయతీలకు నిధులు రావడంతో మౌలిక వసతుల కల్పనతో పాటు అభివృద్ధి పనులు చకచకా పూర్తయ్యాయి. విద్యాపరంగా చూస్తే విద్యార్థినుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కోడూర్ శివారులో రూ. 3.35 కోట్ల వ్యయంతో ప్రభుత్వం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం భవనం నిర్మించింది.



మన ఊరు - మన బడిలో సుందరంగా రూపుదిద్దుకున్న కోడూర్ ప్రాథమిక పాఠశాల

రూ.14.80 కోట్లతో డబుల్ బెడ్‌రూం ఇండ్లు

మండలంలో ఇండ్లు లేని నిరుపేదలకు ఇంటి వసతిని కల్పించడానికి డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి రూ.14.80 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో 296 డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి, లబ్ధిదారులకు అందజేశారు. దీంతో లబ్ధిదారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కోడూర్ గ్రామానికి అవార్డు

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ అవార్డు 2023 జిల్లాలో 5వేల జనాభా కంటే తక్కువ జనాభా కలిగిన గ్రామాల నుంచి మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోడూర్ పంచాయతీ జాతీయ అవార్డుకు నామినేట్ చేయబడింది. ఇందుకు సర్పంచ్ బి.శ్రీకాంత్‌గౌడ్ కలెక్టర్ రవినాయక్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.

గత పాలకులు అభివృద్ధిని మరిచారు



సమైక్య పాలనలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని విస్మరించారు. సీఎం కేసీఆర్ హయాంలోనే గ్రామాల అభివృద్ధికి తగినంత నిధులు కేటాయిస్తున్నారు. రోడ్లు, తాగునీరు, 24 గంటల కరెంట్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతున్నారు.

– దేవేందర్‌రెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు, మహబూబ్‌నగర్ రూరల్

పల్లెప్రగతితో గ్రామాల అభివృద్ధి



పల్లెప్రగతి కార్యక్రమంతో గ్రామాలన్నీ ప్రగతి బాటపట్టాయి. గతంలో ఇంతటి అభివృద్ధి కాలేదు. ఎన్నడూ లేని, ఊహించని విధంగా మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నాం. ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యలన్నీ పరిష్కరించాం.

– శ్రీకాంత్‌గౌడ్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, మహబూబ్‌నగర్ రూరల్

ఎన్నికల నేపథ్యంలో నిరంతరం నిఘా



మాట్లాడుతున్న తహసీల్దార్ నాగార్జున

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిఘా టీంలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అర్బన్ తహసీల్దార్ నాగార్జున అన్నారు. శుక్రవారం జెడ్పీ హాల్‌లో ఫ్లెయింగ్ స్క్వాడ్ టీంలతో సమావేశమై మాట్లాడారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లో మూడు టీంలు ఉంటాయని, ఒక్కో టీంలో ఏడుగురు సభ్యులు ఉంటారన్నారు. ఎస్‌ఎస్‌టీ టీంలు మూడు ఉంటాయని, ఇందులో ఐదుగురు సభ్యులు ఉంటారని తెలిపారు. వీడియోసర్వే మూడు టీంలు ఉంటాయని ఇందులో ముగ్గురు సభ్యులు ఉంటారని, ఎంసీసీ టీంలు మూడు ఉంటాయని ఇందులో ముగ్గురు చొప్పున సభ్యులు ఉంటారని తెలిపారు. అకౌంట్స్ టీంలో నలుగురు సభ్యులు ఉంటారని చెప్పారు. వీరు ప్రతి రోజు క్షేత్ర స్థాయిలో పర్యటించి నివేదికలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి అనుమానం వచ్చినా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయాలన్నారు. విధులను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో డీటీలు రాజ్‌గోపాల్, సునీల్, ఆర్‌ఐలు చైతన్య, క్రాంతికుమార్, నర్సింగ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంధకారంలో ఇంటర్నల్ రహదారులు



భూత్పూర్ పట్టణంలోని బ్రిడ్జి వద్ద అంధకారంలో ఇంటర్నల్ రహదారి

భూత్పూర్: పట్టణంలోని చౌరస్తాలోని ఇంటర్నల్ రహదారులు కొన్ని నెలలుగా అంధకారంగా మారుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. ఎల్‌అండ్‌టీ వారు బ్రిడ్జికి ఇరువైపులా కిలోమీటర్ మేర హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. ఈ లైట్లు పడక నెలలు గడుస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడమా, విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయనే భయంతో బంద్ చేస్తున్నారా తెలియడం లేదు. జిల్లా కేంద్రానికి, జడ్చర్ల, కర్నూల్ నుంచి నిత్యం వివిధ ప్రాంతాలకు ఉద్యోగ రీత్యా వాహనాలు, బస్సుల్లో వచ్చి బ్రిడ్జికి ఇరువైపులా ప్రారంభంలోనే ప్రయాణికులు దిగి నడుచుకుంటూ వెళ్తుంటారు. రాత్రి వేళ కావడంతో బ్రిడ్జికి ఇరువైపులా వెలుతురు లేకపోవడంతో ఇబ్బందులకు గురౌతున్నారు. మున్సిపల్ అధికారులు వారి పరిధిలోని స్తంభాలకు సైతం విద్యుత్తు లైట్లు ఏర్పాటు చేయలేదు. జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని బ్రిడ్జికి ఇరువైపులా రహదారులపై లైట్లు పడేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలి



నిర్మాణాలను పరిశీలిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: పట్టణంలోని ఏనుగొండ శివారులో గల ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి 26 గుంటల భూమి ఉందని, కొందరు ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని డీవీఎంసీ సభ్యుడు బాలరాజు పేర్కొన్నారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం విషయమై శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా నిర్మాణాలను పరిశీలించారు. ఎస్సీ కార్పొరేషన్ భూమిని సర్వే చేయించి హద్దులు కూడా పాతారని, హద్దులను చెరిపి కొందరు ఇళ్ల నిర్మాణాల చేపట్టడం విడ్డూరంగా ఉందని అన్నారు. అధికారులు తక్షణమే స్పందించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



బతుకమ్మతో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం

భూత్పూర్: పట్టణంలోని పాఠశాలల్లో శుక్రవారం బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దసరా పండుగ సందర్భంగా పట్టణంలోని స్థానిక ప్రైవేట్ పాఠశాలల్లో చిన్నారులచే తీరొక్క పూలతో బతుకమ్మను తయారు చేశారు. విద్యార్థులకు పాఠశాలల్లో వివిధ పండుగల యొక్క ప్రాధాన్యతను వివరించాలని చైర్మన్ బస్వరాజ్ గౌడ్ ఉపాధ్యాయులకు తెలిపారు.

నిబంధనలు అమలు చేయాలి



దేవరకద్రలోలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి నటరాజ్

దేవరకద్ర: ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నటరాజ్ ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశపు హాలులో నియోజకవర్గ పోలీస్, ఎక్సైజ్, ఇతర శాఖల అధికారుల సమావేశంలో ఈఆర్ఓ మాట్లాడారు. నియోజకవర్గంలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనాల తనిఖీ ముమ్మరం చేయాలని అక్రమంగా డబ్బులు తరలిస్తే సీజ్ చేయాలన్నారు. గ్రామాలలో మద్యం విక్రయాలు సాగకుండా చూడాలని ఎలాంటి గొడవలు కాకుండా శాంతి భద్రతలను కాపాడాలన్నారు. సమావేశంలో ఎన్నికల కోడ్ అమలు కోసం కమిటీలను వేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రవీందర్, ఎంపీడీఓ శ్రీనివాసులు, డీటీ శివరాజు తదితరులు పాల్గొన్నారు.

గారడీ మాటలు నమ్మొద్దు



మద్దూరులో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూరు: ఎన్నికల కోసం రేవంత్‌రెడ్డి చేసే గారడీ మాటలు నమ్మకండని, నియోజకవర్గ ప్రజలకు ఈ ఐదేళ్లు ఎల్లవేళలా అందుబాటులో ఉన్నానని, ఉంటానని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మద్దూరు, కొత్తపల్లి మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రతి కార్యకర్త రానున్న 50 రోజుల్లో ప్రజలకు వివరించాలని, అన్ని పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించాలన్నారు. మూడో సారి కూడా ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉంటుందని తెలిపారు. ఈ నెల 15వ తేదిన బొంరాస్‌పేట మండలంలోని మదనపల్లి నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సలీం, వెంకటయ్య, మధుసుధన్‌రెడ్డి, అరుణ, షేక్‌మీరాన్, వెంకట్‌రాములుగౌడ్, వీరారెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.